అనిల్‌కు నాలుగు పతకాలు

రాచకొండ హెడ్‌కానిస్టేబుల్‌కు సీపీ అభినందన

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాచకొండ కమిషనరేట్ పరిధి భువనగిరి జోన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అంబోజు అనిల్‌కుమార్ పాన్‌ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలతో మెరిశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీ 45 ఏండ్ల వయసు విభాగంలో నాలుగు పతకాలు(స్వర్ణం, మూడు కాంస్యాలు) సాధించాడు. 4X400 మీటర్ల పరుగు పందెంలో పసిడి కొల్లగొట్టాడు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో రాచకొండ సీపీ తరుణ్‌జోషి.. అనిల్‌కుమార్‌ను అభినందించారు. సెప్టెంబర్‌లో అస్ట్రేలియాలో జరుగనున్న అంతర్జాతీయ టోర్నీలో విజయాలు సాధించి పోలీస్ శాఖ ప్రతిష్ఠ పెంచాలని సీపీ ఆకాంక్షించారు.

సాల్ట్ ఫటాఫట్

అర్ధసెంచరీతో వీరవిహారం

సెయింట్ లూసియా: టీ20 ప్రపంచకప్ గూప్ దశలో ఒడిదొడుకులకు లోనైన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ కీలకమైన సూపర్-8 స్టేజ్ తొలి మ్యాచ్‌లో మాత్రం చాంపియన్ ఆట ఆడింది. ఈ టోర్నీలో అపజయమన్నదే లేకుండా సాగుతున్న ఆతిథ్య వెస్టిండీస్‌ను ఓడించి సెమీస్ రేసులో ముందంజ వేసింది. విండీస్ నిర్దేశించిన 181 పరుగుల ఛేదనను 17.3 ఓవర్ల లోనే అలవోకగా ఛేదించి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో ఆ జట్టు ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 87 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్సర్లు) సుడిగాలి ఇన్నింగ్స్‌కు తోడు జానీ బెయిర్‌స్టో (26 బంతుల్లో 48 నాటౌట్, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరవిహారం చేయడంతో కరేబియన్ బౌలర్లు తేలిపోయారు. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. చార్లెస్ (34 బంతుల్లో 38, 4 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ పావెల్ (17 బంతుల్లో 36, 5 సిక్సర్లు) దూకుడుగా ఆడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. సాల్ట్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

సాల్ట్, బెయిర్ స్టో షో..

భారీ ఛేదనను ఇంగ్లండ్ ధాటిగానే ఆరంభించింది. ఐపీఎల్‌లో భీకరమైన ఫామ్ కనబర్చిన సాల్ట్.. అదే జోరును ఇక్కడా కొనసాగించాడు. సారథి బట్లర్ (25) నెమ్మదిగా ఆడినా క్రీజులో కుదురుకున్నాక సాల్ట్ రెచ్చిపోయాడు. బట్లర్‌తో పాటు మోయిన్ అలీ (13) నిష్క్రమించినా బెయిర్ స్టో రాకతో అగ్నికి వాయువు తోడైనట్టు అయింది. ఈ ఇద్దరూ విండీస్ బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డారు. అల్జారీ 14వ ఓవర్లో 6, 4 బాదిన బెయిర్ స్టో.. అకీల్ హోసెన్ 15వ ఓవర్లో 4, 6, 4 సాధించాడు. ఇక రొమారియా షెపర్డ్ 16వ ఓవర్లో తొలి బంతిని బౌండరీగా మలిచి 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసిన సాల్ట్.. ఆ తర్వాత 6, 4, 6, 6, 4తో ఇంగ్లండ్ విజయం ఖాయమైంది.

విండీస్ సమిష్టిగా..

బౌలర్లు విఫలమైనా మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ బ్యాటర్లు మాత్రం సమిష్టిగా రాణించారు. వేగంగా ఆడిన బ్రాండన్ కింగ్ (23) గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినా అతడి స్థానంలో వచ్చిన పూరన్ (36) తో కలిసి చార్లెస్ ఇంగ్లండ్ బౌలింగ్‌ను ఆటాడుకున్నాడు. చార్లెస్‌ను మోయిన్ అలీ ఔట్ చేశాక క్రీజులోకి వచ్చిన పావెల్.. లివింగ్‌స్టాన్ 15వ ఓవర్లో 3 భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. కానీ అదే ఓవర్లో మార్క్ వుడ్ చేతికి చిక్కాడు. మరుసటి ఓవర్లో పూరన్ కూడా పెవిలియన్ చేరినా ఆఖర్లో షెర్ఫెన్ రూతర్‌ఫర్డ్ (28 నాటౌట్) దూకుడుగా ఆడి విండీస్‌కు భారీ స్కోరు అందించాడు.

సంక్షిప్త స్కోర్లు:
వెస్టిండీస్ : 20 ఓవర్లలో 180/4 (చార్లెస్ 38, పావెల్ 36, మోయిన్ 1/15, లివింగ్‌స్టాన్ 1/20). **ఇంగ్లండ్:** 17.3 ఓవర్లలో 181/2 (సాల్ట్ 87 నాటౌట్, బెయిర్‌స్టో 48 నాటౌట్, చేజ్ 1/19, రస్సెల్ 1/21)

సూపర్-8లో టీమ్‌ఇండియా బోణీ

భారత్ సూపర్

అఫ్గానిస్థాన్‌పై ఘన విజయం

రాణించిన సూర్యకుమార్, పాండ్యా..బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ విజృంభణ

ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. లీగ్ దశలో అమెరికాలో ఇరుగదీసిన టీమ్‌ఇండియా కరీబియన్ ఇలాఖాలో కదంతొక్కింది. అఫ్గానిస్థాన్‌తో సూపర్-8 పోరులో ఘన విజయంతో బోణీ కొట్టింది. సూర్యకుమార్‌యాదవ్, హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌తో భారీ స్కోరు అందుకున్న భారత్ బార్బడోస్‌లో అఫ్గన్‌ను మట్టికరిపించింది. బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ విజృంభణతో అఫ్గన్‌ను 134 పరుగులకే పరిమితం చేస్తూ కప్ వేటలో మరో అడుగు ముందుకేసింది.

బ్రిడ్జ్‌టౌన్: తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్నది. గురువారం బార్బడోస్ వేదికగా జరిగిన సూపర్-8 తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌పై 47 పరుగుల తేడాతో భారత్ విజయదుందుభి మోగించింది. లీగ్ దశ విజయ పరంపరను కొనసాగిస్తూ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. మొదట సూర్యకుమార్‌యాదవ్(28 బంతుల్లో 53, 5ఫోర్లు, 3సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా(24 బంతుల్లో 32, 3ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 181/8 స్కోరు చేసింది. ఫజుల్లా ఫారుఖి(3/33), రషీద్‌ఖాన్(3/26) మూడేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో బుమ్రా(3/7), అర్ష్‌దీప్‌సింగ్(3/36) ధాటికి అఫ్గన్ 20 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్(26) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అర్ధసెంచరీతో జట్టుకు పోరాడే స్కోరు అందించిన సూర్యకుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శనివారం బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

సూర్యకుమార్ (53)

అఫ్గన్ పేలవంగా:
భారత్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో అఫ్గన్‌కు సరైన శుభారంభం దక్కలేదు. మ్యాచ్‌కు ముందు బీరాలు పలికిన ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(11)ను బుమ్రా తొలి వికెట్‌గా సాగనంపి వికెట్ల వేటకు తెరతీశాడు. ఓవైపు బుమ్రా స్వింగ్‌కు తోడు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (2/32), అక్షర్‌పటేల్ (1/15), జడేజా (1/20) విజృంభణతో అఫ్గన్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో అజ్మతుల్లా, నయిబ్ (17) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. హజ్రతుల్లా(2), జద్రాన్(8) ఘోరంగా విఫలమయ్యారు. ఆదిలో తడబడ్డ అర్ష్‌దీప్ ఆఖర్లో టెయిలెండర్ల వికెట్లు తీసి విజయంలో కీలకమయ్యాడు.

సంక్షిప్త స్కోర్లు:
భారత్: 20 ఓవర్లలో 181/8(సూర్యకుమార్ 53, హార్దిక్ 32, రషీద్ 3/26, ఫారుఖి 3/33), **అఫ్గానిస్థాన్:** 20 ఓవర్లలో 134 ఆలౌట్(అజ్మతుల్లా 26, నజీబుల్లా 19, బుమ్రా 3/7, అర్ష్‌దీప్‌సింగ్ 3/36)

పడుతూ లేస్తూ:
తొలుత టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. తాను ఎదుర్కొన్న ఐదో బంతికి బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన రోహిత్(8) ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. ఫస్ట్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్(20)..కోహ్లీ(24)కి జతకలిశాడు. వీరిద్దరు మరో వికెట్ కోల్పోకుండా సమయోచితంగా వ్యవహరిస్తూ స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. నబీ వేసిన ఆరో ఓవర్‌లో పంత్ హ్యాట్రిక్ ఫోర్లతో అదరగొట్టాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది. రషీద్ బౌలింగ్‌లో భారత్ 90 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది.

సూర్య, పాండ్యా ధనాధన్:
ఇబ్బందుల్లో ఉన్న టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌ను సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా గాడిలో పడేశారు. సూర్య తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డును పరిగెత్తించడంతో భారత్ 13వ ఓవర్లో 100 పరుగుల మార్క్ అందుకుంది.సూర్యకు పోటీగా పాండ్యా కూడా బ్యాటు ఝుళిపించడంతో పరుగుల రాక సులువైంది. ఫోర్‌తో అర్ధసెంచరీ అందుకున్న సూర్య మరుసటి బంతికే ఔట్ కావడంతో ఐదో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. వీరి బ్యాటింగ్‌తో భారత్ పోరాడే స్కోరు అందుకుంది.

స్వదేశంలో భారత్ బిజీ బిజీ

- **2024-25 హోం సీజన్ షెడ్యూల్ విడుదల**
- **హైదరాబాద్‌లో బంగ్లాతో టీ20 మ్యాచ్**

ముంబై: 2024-25 సీజన్‌కు గాను భారత క్రికెట్ జట్టు స్వదేశంలో ఆడే మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం వెల్లడించింది. పొట్టి ప్రపంచకప్ ముగిసిన తర్వాత జూలైలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్న భారత్.. సెప్టెంబర్ 19-అక్టోబర్ 23 మధ్య స్వదేశంలో బంగ్లాదేశ్‌తో రెండు టెస్టులు, మూడు టీ20లు ఆడనుంది. టీ20 సిరీస్‌లో భాగంగా అక్టోబర్ 12న జరుగబోయే మూడో మ్యాచ్‌కు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. అక్టోబర్ 16-నవంబర్ 05 మధ్య న్యూజిలాండ్ జట్టు.. భారత్‌లో పర్యటించనుంది.

డేవిడ్ జాన్సన్ అనుమానాస్పద మృతి

బెంగళూరు: భారత క్రికెట్ జట్టు మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. 52 ఏండ్ల జాన్సన్.. బెంగళూరులోని కోతనూరు కనక శ్రీ లే అవుట్ వద్ద తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందపడి మరణించడం అనుమానాలకు తావిస్తోంది. ఆయన ప్రమాదవశాత్తు పడిపోయాడని చెబుతున్నప్పటికీ జాన్సన్.. దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా మానసికంగా ఆయన ఆరోగ్యం సరిగ్గా లేనట్టు ఓ పోలీసు అధికారి వెల్లడించాడు.

పతకాలు కోల్పోయినా 'పారిస్' పక్కా!

- **ర్యాంకింగ్స్‌పై భారత ఆర్చర్ల ధీమా**

అంటల్య: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 3 పోటీలలో భారత రికర్వ్ ఆర్చర్లు పతకాలు సాధించడంలో విఫలమైనా పారిస్ ఒలింపిక్ బెర్తులను దాదాపుగా ఖాయం చేసుకున్నారు. మహిళల విభాగంలో దీపికా కుమారి, భజన్, అంకితాతో కూడిన త్రయం.. సెమీస్‌లో 4-5తో ఫ్రాన్స్ చేతిలో ఓటమిపాలైంది. కాంస్య పోరులో జపాన్ 6-0తో భారత్‌కు పరాభవం తప్పలేదు. ఇక ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌తో కూడిన పురుషుల జట్టు సైతం క్వార్టర్స్‌లో 1-5తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. కాగా రికర్వ్ ఆర్చర్ల నిరాశపరిచినా ఈ నెల 25న విడుదల కాబోయే ర్యాంకింగ్స్‌ను బట్టి పారిస్ బెర్తులు ఖరారు అవుతాయి. కొత్త నిబంధనల ప్రకారం.. ఒలింపిక్ బెర్తులు ఖాయం కాని జట్లలో టాప్-2 టీమ్స్‌కు కోటా దక్కుతుంది.

డ్రాగన్‌లో నెగెటివ్‌గా..

హీరోలను నెగెటివ్ షేడ్స్‌లో చూపించడంలో ప్రశాంత్‌నీల్‌ది ప్రత్యేకశైలి. 'కేజీఎఫ్' ఫ్రాంచైజీనే అందుకు ఉదాహరణ. 'సలార్ శౌర్యాంగపర్వం' తర్వాత ఆయన ఎన్టీఆర్‌తో సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. డ్రాగన్ అంటే యూరోపియన్ సంస్కృతిలో చెడుకి గుర్తు. మైథాలజీలో 'డ్రాగన్' అంటే రాక్షసుడు. చూపులకు పాములా, కాళజిహ్వలా కనిపించే డ్రాగన్‌కి నిప్పును పీల్చే గణం ఉంటుంది. అలాగే డ్రాగన్ అంటే అలజడికి సింబాలిక్. మరి ఇలాంటి భయంకరమైన టైటిల్‌ని ఈ సినిమాకు అనుకోవడం ప్రస్తుతం చర్చకు దారితీసింది. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం ఇందులో తారక్‌ది నెగెటివ్ రోల్ అని తెలుస్తున్నది. టైటిల్‌కి తగ్గట్టుగా ఉండేలా తారక్ కేరక్టర్‌ని ప్రశాంత్ డిజైన్ చేశారట. హీరోను నెగెటివ్‌గా చూపించడంలో ప్రశాంత్ మాస్టర్ అయితే.. నెగెటివ్ పాత్రల్లో నటించడంలో తారక్ ప్రిన్సిపల్. 'టెంపర్'లో పోలీస్‌ఆఫీసర్ దయాగా ఆయన నటన గురించి ఇప్పటికీ చెప్పుకుంటారు. ఇక 'జై లవకుశ'లో 'జై' పాత్ర గురించి అందరికీ తెలిసిందే. ఓ విధంగా నటుడిగా తారక్ విశ్వరూపం అది. ప్రస్తుతం హృతిక్‌రోషన్‌తో చేస్తున్న 'వార్' సినిమాలో కూడా తారక్ నెగెటివ్ రోల్‌లోనే కనిపిస్తారని బాలీవుడ్ టాక్. ప్రశాంత్‌నీల్ కూడా ఆయన్ని నెగెటివ్‌గా చూపించబోతున్నాడని తెలుస్తున్నది. ఇది అభిమానులను నిజంగా ఆనందింపజేసే వార్తే.

ఇటలీ విహార యాత్రలో..

చిత్రం

అగ్ర కథానాయిక రష్మిక మందన్న చేతిలో ప్రస్తుతం ఆరు భారీ చిత్రాలున్నాయి. వరుస షూటింగ్స్‌తో బిజీగా ఉండటం వల్ల రిలాక్స్ కావడానికి ఈ భామకు ఏమాత్రం సమయం చిక్కడం లేదట. అయితే ఇటీవల కాస్త విరామం దొరకడంతో ఈ అమ్మడు ఇటలీలో వాలిపోయింది. అక్కడి అందమైన లొకేషన్లలో సేద తీరుతూ, ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ , పుస్తకాలను చదువుతూ ఉల్లాసంగా గడుపుతున్నది. తన విహార యాత్ర ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటున్నది. బ్లాక్ అండ్ వైట్ థీమ్‌తో ఈ ఫొటోలను పోస్ట్ చేస్తుండటం విశేషం. నిత్యం కెమెరా వెలుగుల నడుమ అలసిపోయిన తనకు ఈ యాత్ర పునరుత్తేజాన్ని ఇస్తున్నదని రష్మిక మందన్న ఆనందం వ్యక్తం చేసింది. గత ఏడాది 'యానిమల్' చిత్రంతో కెరీర్‌లోనే భారీ విజయాన్ని దక్కించుకున్న ఈ సొగసరి ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఆరు సినిమాల్లో నటిస్తున్నది. అందులో పుష్ప-2, కుబేర, సికందర్ (హిందీ) వంటి భారీ సినిమాలున్నాయి. ఈ ఏడాది కూడా తనకు తిరుగులేని విజయాలను అందిస్తుందన్న భరోసాతో ఉంది రష్మిక మందన్న.

మూడు ప్రపంచాల కథ

'కల్కి 2898' సినిమా కథ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు దర్శకుడు నాగ్‌అశ్విన్. మూడు విభిన్న ప్రపంచాల మధ్య నడిచే ఈ కథ ప్రేక్షకులకు ఆద్యంతం కొత్త అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ప్రభాస్ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 'వరల్డ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ-2' పేరుతో దర్శకుడు నాగ్‌అశ్విన్ ఓ వీడియోను పంచుకున్నారు. ఇందులో 'కల్కి' కథా సారాంశాన్ని వివరించారు. కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే మూడు ప్రపంచాల నడుమ ఈ కథ నడుస్తుందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'గంగా నది ఒడ్డున ఉన్న కాశీని ప్రపంచంలోనే మొదటి నగరమని అనేక శాసనాల్లో పేర్కొన్నారు. మన నాగరికత పుట్టుక కూడా ఇక్కడ నుంచే ఆరంభమైందని చెబుతారు. ఒకవేళ కాశీనే మానవాళికి చివరి నగరమైతే ఎలా ఉంటుందనే ఊహ నుంచి ఈ కథ రాసుకున్నా. కాశీపైన తిరగేసిన పిరమిడ్ ఆకారంలో ఓ నిర్మాణం ఉంటుంది. దానిని కాంప్లెక్స్ అంటారు. అదొక స్వర్గంలాంటిది. కాంప్లెక్స్‌లో ఉండే వనరులను కాశీ ప్రజలకు అందకుండా కొందరు నియంత్రిస్తుంటారు. ఈ రెండు ప్రపంచాలతో పాటు శంబాలా అనే మరో ప్రపంచం ఉంటుంది. ఇది కల్కి కథకు అనుసంధానమై ఉంటుంది. ఇక్కడ నుంచే విష్ణువు చివరి అవతారం కల్కి వస్తుంది. ఈ మూడు ప్రపంచాల మధ్య సంబంధం ఏమిటన్నదే 'కల్కి'లో ఆసక్తికరమైన అంశం' అని నాగ్‌అశ్విన్ తెలిపారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్, దిశా పటానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

తెలుగువాళ్లతో సన్నీడియోల్ హిందీ సినిమా

గత ఏడాది 'గదర్ 2'తో 600కోట్ల భారీ విజయాన్ని సొంతం చేసుకున్న బాలీవుడ్ యాక్షన్ హీరో సన్నీడియోల్ కథానాయకుడిగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ స్టైయిట్ హిందీ చిత్రం తెరకెక్కనుంది. ప్రతిష్టాత్మక టాలీవుడ్ నిర్మాణసంస్థలు మైత్రీ మూవీమేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనుండటం విశేషం. పూర్తి కమర్షియల్ అంశాలతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుందని, 'SDGM' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సన్నీడియోల్‌ని మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో చూస్తారని గోపీచంద్ మలినేని చెబుతున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో ప్రత్యేక అతిథులతో ఈ సినిమా గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. రేపటి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబీ, మాటలు: సౌరభ్ గుప్తా, సంగీతం: థమన్.ఎస్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి.విశ్వప్రసాద్.

మాయాసుందరి.. ఎక్కడున్నావో..

చేతన్‌కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూంధాం'. సాయికుమార్, వెన్నెలకిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇందులో కీలక పాత్రధారులు. సాయికిశోర్ మచ్చా దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు సంబంధించిన రెండవ పాటను మేకర్స్ విడుదల చేశారు. 'మాయాసుందరి.. హే మాయాసుందరి.. నా మాయాసుందరి.. ఎక్కడున్నావో మరీ..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, గోపీసుందర్ స్వరపరిచారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. హీరో పాడుకునే ఈ ప్రేమగీతాన్ని దర్శకుడు సాయికిశోర్ మచ్చా స్టైలిష్‌గా రూపొందించారని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: ప్రవీణ్‌వర్మ, కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి.

అహో! విక్రమార్క

'పూణెలో తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే.. హైదరాబాద్‌లో రాజమౌళి నాకు పేరునిచ్చారు. వారివల్లే ఈ రోజు ఓ సినిమాను నిర్మించే స్థాయికి రాగలిగాను. ఇందులో నేనే హీరో. ఎంతో ఆనందంగా గర్వంగా ఉంది. ఇన్నాళ్లు నన్ను విలన్‌గా చూశారు. త్వరలో హీరోగా సర్‌ప్రైజ్ ఇవ్వనున్నా. విజన్ ఉన్న దర్శకుడు త్రికోటి. ప్రమోషన్స్ స్టార్ట్ చేశాం. విజయం ఇస్తారని ఆశిస్తున్నా' అన్నారు దేవ్‌గిల్. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'అహో! విక్రమార్క'. గురువారం ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ 'మగధీర' నుంచి దేవ్‌గిల్ పరిచయం. ఎప్పట్నుంచో ఇద్దరం సినిమా చేద్దామనుకుంటున్నాం. ఆయనకు ఎలాంటి కథ అయితే బాగుంటుందని ఆలోచించా. చివరకు పోలీస్ కథతో ఈ సినిమా చేశాం. తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. ఇంకా దేవ్‌గిల్ భార్య, నిర్మాత ఆర్తి, నటులు యువరాజ్, ప్రవీణ్, నటి చిత్రాశుక్లా కూడా మాట్లారు.

యథార్థ ఘటనల 'మట్కా'

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకుడు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్‌ను జరుపుకుంటున్నది. నలభై రోజుల పాటు జరిగే ఈ తాజా షెడ్యూల్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను నిర్మించారు. ఇందులో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను చిత్రీకరించనున్నారు. 'దేశం మొత్తం సంచలనం సృష్టించిన యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తెరకెక్కుతున్నది. డిఫరెంట్ టైమ్ లైన్స్‌లో నడిచే ఈ కథలో హీరో వరుణ్‌తేజ్ నాలుగు విభిన్న అవతారాల్లో కనిపిస్తారు. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమా అన్ని భాషల వారికి కనెక్ట్ అవుతుంది' అని చిత్రబృందం పేర్కొంది. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిషోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

ఉత్కంఠ భరితంగా 'మహిష'

సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'మహిష'. ప్రవీణ్ కేవీ స్వీయదర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు కథానాయకుడు కూడా ఆయనే. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ని హీరో శ్రీకాంత్, ప్రతాని రామకృష్ణ గౌడ్ కలిసి ఆవిష్కరించారు. సినిమా విజయం సాధించాలని ఇద్దరూ శుభాకాంక్షలు అందించారు. ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసే కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుందని ప్రవీణ్ కేవీ నమ్మకం వెలిబుచ్చారు. పృథ్వీ, యషిక, వైష్ణవి, కపిల్, మౌనిక, దీపు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీశ్, వివేక్, సంగీతం: శ్రీవెంకట్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.